# వరంగల్ వాయిస్

Evening Daily

సంపుటి : 04 | సంచిక : 291
పేజీలు : 08 | వెల: రూ.5/-

శుక్రవారం
ఆగస్టు 29, 2025

www.epaper.warangalvoice.net | www.warangalvoice.net




## అతని ఆస్తులు రూ. 5 కోట్ల పైనే

- ఫోర్ట్ వరంగల్ తహశీల్దార్ పై ఏసీబీ కేసు
- హనుమకొండలోని ఇంటితోపాటు ఏడు ప్రాంతాల్లో సోదాలు

8లో..



# లీకేజీలకు.. బ్రేక్ ఎప్పుడూ?

- మురుగు కాలువ పాలవుతున్న తాగునీరు
- మరమ్మతులు పేరిట ఏటా రూ.3 కోట్ల పైనే ఖర్చు
- అయినా లభించని శాశ్వత పరిష్కారం
- కాసులకోసం క్వాలిటీలేని పనులంటున్న జనం
- బల్దియా ఇంజనీరింగ్ యంత్రాంగంపై మండిపాటు






## గల్లీ గల్లీలో పైప్ లైన్ లీకేజీలు

గ్రేటర్ వరంగల్ పరిధిలోని ఏ గల్లీ చూసినా ఏమున్నది గర్వకారణం అన్నట్లుగా మారింది. గల్లీ గల్లీలో పైప్ లైన్ లీకేజీలు కుప్పలు తెప్పలుగా కనిపిస్తున్నాయి. ఎక్కడ చూసినా మరమ్మతుల కోసం తవ్విన గుంతలే దర్శనమిస్తున్నాయి. గ్రేటర్ పరిధిలోని మొత్తం **66** డివిజన్లలో ఈ లీకేజీలు వేయికి పైగానే ఉన్నట్లు బల్దియా అధికారులే చెప్పుకొస్తున్నారు. బీటెక్., ఎంటెక్ లు పూర్తి చేసిన ఇంజినీరింగ్ యంత్రాంగం ఉన్నప్పటికీ లీకేజీలను అరికట్టలేకపోవడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అయితే లీకేజీల మరమ్మతులకు ఏటా కోట్ల రూపాయలు ఖర్చు చేస్తున్నా శాశ్వత పరిష్కారం మాత్రం కనిపించడం లేదు. గత సంవత్సరం రూ.**3.50**కోట్లు లీకేజీ మరమ్మతులకోసమే ఖర్చు పెట్టడం గమనార్హం. లీకేజీలను అరికట్టేందుకు అధునాతన సాంకేతికత అందుబాటులో ఉన్నప్పటికీ పదే పదే లీక్ కావడం వెనుక కుట్ర దాగి ఉందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. లీకేజీలను పూర్తిగా అరికడితే ఇంజినీరింగ్ అధికారుల ఆదాయానికి గండి పడుతుందన్న ఆలోచనతోనే శాశ్వత మరమ్మతులు చేపట్టంలేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇందులో పాలకవర్గానికి పెద్ద మొత్తంలో వాటాలు దక్కడంతో వారు నామమాత్రపు పనులకే మొగ్గు చూపుతున్నట్లు ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి. ఇంజినీరింగ్ అధికారులు తమ మనసాక్షి మేరకు పని చేస్తే నగరంలో లీకేజీలే ఉండవంటున్నారు.

–వరంగల్ వాయిస్ ప్రతినిధి

వివరాలు2లో..



8లో..

## అభ్యంతరాలుంటే చెప్పండి

- ఈనెల 30 వరకు అవకాశం
- హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్
- జీపీల్లో ఓటర్ల ముసాయిదా జాబితా రెడీ



8లో..

## నకిలీ పాస్ పుస్తకాలతో బ్యాంకులకు టోకరా

- కురవిలో ముగ్గురు అరెస్టు
- మహబూబాబాద్ డీఎస్పీ తిరుపతిరావు వెల్లడి



8లో..

## సమాజహితానికి జర్నలిస్టులు పనిచేయాలి

- సమాచార కమిషనర్లు పీవీ శ్రీనివాస్, బోరెడ్డి అయోధ్యరెడ్డి

## పొలం మాయం

2లో..

- ట్రాక్టర్ తో దున్నించిన దుండగుడు
- న్యాయం చేయాలని బాధితురాలి వినతి
- పొలం ధ్వంసం చేసిన వ్యక్తిపై అధికారులకు ఫిర్యాదు

# లీకేజీలకు.. బ్రేక్ ఎప్పుడూ ?

- గల్లీ గల్లీలో పైప్ లైన్ లీకేజీలు
- మురుగు కాలువ పాలవుతున్న తాగునీరు
- మరమ్మతులు పేరిట ఏటా రూ.3 కోట్ల పైనే ఖర్చు
- అయినా లభించని శాశ్వత పరిష్కారం
- కాసులకోసం క్వాలిటీలేని పనులంటున్న జనం
- బల్దియా ఇంజినీరింగ్ యంత్రాంగంపై మండిపాటు

**వరంగల్ వాయిస్ ప్రతినిధి :** వరంగల్ మహా నగర పాలక సంస్థ పరిధిలో పైప్ లైన్ లీకేజీల పరంపర కొనసాగుతోంది. నగరంలో లీకేజీల గుర్తింపు, నియంత్రణకు ఇంజినీరింగ్ విభాగం చర్యలు చేపట్టకపోవడంతో నిత్యం 40ఎంఎల్ డీలకు పైగా తాగునీరు వృథాగా పోతున్నట్లు సమాచారం. డివిజన్ లోని గల్లీలలోనే కాదు ప్రధాన రహదారిపై కూడా వారం, పది రోజులుగా పైప్ లైన్ లీకేజీ ఏర్పడి తాగునీరు పెద్ద మొత్తంలో వృథా అవుతున్నా పట్టించుకునేవారే కరువయ్యారు. స్థానికులు స్పందించి స్థానిక ప్రజా ప్రతినిధులకు, అధికారులకు ఫోన్ ద్వారా సమాచారం అందించినా ఇంజినీరింగ్ అధికారులకు చీమ కుట్టినట్లు కూడా లేకపోవడంపై బాటసారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వరంగల్ లోని హండర్ బ్రిడ్జి ప్రాంతంలో గత మూడు రోజులుగా మెయిన్ పైప్ లైన్ లీకేజీ ఏర్పడి బాటసారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నా అధికారులు, పాలకులు చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారు.

### నిత్యం ప్రమాదాలు..

పైప్ లైన్ లీకేజీలతో ఏర్పడుతున్న గుంతలతో నిత్యం ప్రమాదాలు జరుగుతున్న బల్దియా పాలకవర్గం పట్టించుకోవడంలేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. అండర్ బ్రిడ్జి ప్రాంతంలో గత మూడు రోజులుగా పైప్ లైన్ లీకేజీతో రాకపోకలు స్తంభించిపోగా, ఖమ్మం రోడ్డులోని సాయిబాబ గుడి సమీపంలో గత నెల రోజులుగా ఇదే పరిస్థితి దర్శనమిస్తోంది. ఇక డివిజన్లలోని గల్లీలతో పరిస్థితి మరీ దారుణంగా ఉంది. లీకేజీల మరమ్మతులకోసం గుంతలు తవ్వి వదిలివేయడం పరిపాటిగా మారింది. రాత్రి వేళల్లో గుంతల్లో పడి ప్రమాదాలు జరుగుతున్నా బల్దియా అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

### లీకేజీలపై కుట్రలు..

బల్దియా పరిధిలోని ఒక్కో డివిజన్ లో పది నుంచి పదిహేను లీకేజీలు ఉన్నట్లు బల్దియా సిబ్బంది చెప్పుకొస్తున్నారు. వీటిని మరమ్మతులు చేయడం తలకుమించిన భారంగా మారుతోందంటున్నారు. అయితే లీకేజీల మరమ్మతులకు 2022లో రూ.2.15 కోట్లు, 2023లో రూ.2.50 కోట్లు, 2024లో రూ.3.50 కోట్లు ఖర్చు పెట్టినట్లు తెలియవచ్చింది. ఇంత ఖర్చు పెట్టినా రిపేర్లు చేసిన ప్రాంతంలోనే మళ్లీ లీకవుతుండటంతో పనులు క్వాలిటీగా చేయడం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. లీకేజీలపై పాలకవర్గం, ఇంజినీరింగ్ విభాగం కలిసి కుట్రలు చేస్తున్నారన్న అపవాదు ఉంది. క్వాలిటీ లేని పనులు చేయడం ద్వారా మళ్లీ, మళ్లీ లీకేజీలు ఏర్పడడం.. వాటి మరమ్మతులకు మళ్లీ, మళ్లీ నిధులు కేటాయించడం ద్వారా పెద్ద మొత్తంలో దండుకోవచ్చన్న ఆలోచనలో ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. మరమ్మతుల బిల్లులను ఎవరూ పెద్దగా పట్టించుకోరు కాబట్టి అటు పాలకవర్గం, ఇటు ఇంజినీరింగ్ విభాగం ఒక్కటై నాసిరకం పనులతో జేబులు నింపుకుంటున్నట్లు ఆరోపణలున్నాయి.

### పట్టింపులేని బల్దియా..

అండర్ బ్రిడ్జి ప్రాంతంలో ఏర్పడిన పైప్ లైన్ లీకేజీతో ప్రమాదాలు జరుగుతున్నా పట్టించుకునేవారు కరువయ్యారు. నిత్యం రద్దీగా ఉండే ఈ ప్రాంతంలో పెద్ద మొత్తంలో తాగునీరు వృథాగా మురుగు కాలువలో కలుస్తోంది. ఈ మార్గంలో నిత్యం వేలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుండగా, గుంతల వల్ల తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఒక్కోసారి స్థానికులే స్పందించి ప్రమాదాలు జరుగకుండా అడ్డుగా హెచ్చరిక సూచికలను ఏర్పాటు చేస్తున్నప్పటికీ బల్దియా ఇంజినీరింగ్ విభాగం చేతులు ముడుచుకొని కూర్చుందన్న ఆరోపణలున్నాయి. అయితే ఈ రోడ్డు ఆర్ అండ్ బీకి చెందినది కావడంతో మాకెందుకులే అన్నట్లు గ్రేటర్ అధికారులు వ్యవహరిస్తున్నట్లు ప్రచారం సాగుతోంది. ఇక్కడ పైప్ లైన్ లీకేజీ బల్దియా పరిధిలోకి వస్తుందన్న విషయాన్ని వారు విస్మరిస్తున్నారు. పైప్ లైన్ లీకేజీ లేకుంటే రోడ్డు గుంతలు పడే అవకాశమే లేదు. ప్రధాన రహదారుల్లో లీకేజీలను గుర్తించి తగిన రిపేర్లు చేయాల్సిన జీడబ్ల్యూఎంసీ ఇంజినీరింగ్ విభాగం అన్నీ తెలిసి లైట్ తీసుకుంటున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. పైప్ లైన్ లీకేజీతో ప్రధాన రహదారిపై పెద్ద పెద్ద గుంతలు ఏర్పడి అవి నీటితో నిండిపోవడంతో వాటిని గుర్తించని వాహనదారులు అందులో పడి ప్రమాదాలకు గురవుతున్నారు. ఇప్పటికైనా బల్దియా ఇంజినీరింగ్ అధికారులు మానవతా దృక్పదంతో స్పందించి లీకేజీలను అరికట్టేందుకు నడుం భిగించాలని నగర ప్రజలు కోరుతున్నారు.



### టీడీపీ నేతల నిరసన

గత కొన్ని రోజులుగా వరంగల్ అండర్ బ్రిడ్జి ప్రాంతంలో పైప్ లైన్ లీకేజీతో తాగు నీరు వృథాగా పోవడంపై తెలుగుదేశం పార్టీ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆ పార్టీ ముఖ్య నాయకులు చిలువేరు రవీందర్ ఆధ్వర్యంలో పైప్ లైన్ లీకేజీ ప్రాంతంలో నిరసన వ్యక్తం చేశారు. యుద్ధప్రాతిపదికన లీకేజీ మరమ్మత్తు చేయని పక్షంలో కార్పొరేషన్ ముట్టడి చేపడుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో శిర బోయిన రాజు, తౌటం సంపత్ కుమార్, సుంచు మాధవ్, కాంద్రాతి రాజు, పోలేపాక సాయి కుమార్, సింగారపు మురళి, బండారి పూర్ణచందర్ తదితరులు పాల్గొన్నారు.

# పొలం మాయం

- ట్రాక్టర్ తో దున్నించిన దుండగుడు
- న్యాయం చేయాలని బాధితురాలి వినతి
- పొలం ధ్వంసం చేసిన వ్యక్తిపై అధికారులకు ఫిర్యాదు

**వరంగల్ వాయిస్, పర్వతగిరి :** వరంగల్ జిల్లా పర్వతగిరి మండల కేంద్రానికి చెందిన దళిత మహిళా రైతు చిదురు వెంకటమ్మ తన వారసత్వ అసైన్డ్ భూమిని కోర్టు తీర్పు ద్వారా తిరిగి పొందింది. అయితే, తాజాగా ఆమె పంటను గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేయడంపై ఆవేదన వ్యక్తం చేస్తోంది. పర్వతగిరి బైపాస్ రోడ్డుకు కుడివైపు సర్వే నంబర్ 731/3లో ఉన్న 3.27 ఎకరాల అసైన్డ్ భూమి చిదురు వెంకటమ్మకు వారసత్వంగా వచ్చింది. మొదట ప్రభుత్వం నుంచి ఆమె మామకు, ఆ తర్వాత భర్తకు, భర్త చనిపోయిన తర్వాత ఆమెకు ఈ భూమి సంక్రమించింది. అయితే, గతంలో స్థానిక వ్యక్తి ఒకరు సరైన పత్రాలు లేకుండా ఆ భూమి తనదేనని వాదిస్తూ సాగును అడ్డుకున్నాడు. ఈ విషయమై ఆమె పోలీసులకు, ఎమ్మార్వోకు ఫిర్యాదు చేసినా ఫలితం లేకపోవడంతో కోర్టును ఆశ్రయించింది. కోర్టు ఆమెకు అనుకూలంగా తీర్పు ఇచ్చింది. కోర్టు తీర్పు తర్వాత వెంకటమ్మ తన పొలంలో నాట్లు వేసింది. అయితే, తెల్లారేసరికి తన పొలం కనిపించకుండా పోయిందన్నారు. ఆ వ్యక్తి ట్రాక్టర్‌తో ఆమె పొలాన్ని దున్ని పంటను నాశనం చేశారని వెంకటమ్మ ఆరోపించింది. తను బంగారం కుదువపెట్టి మరీ పంట వేసుకున్నానని, ఇప్పుడు ఆ పంట నాశనం కావడంతో తీవ్రంగా నష్టపోయానని ఆమె ఆవేదన వ్యక్తం చేసింది. తన పొలాన్ని ధ్వంసం చేసిన ట్రాక్టర్ యజమానిపై, ఆ పని చేయించిన వ్యక్తిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేయాలని వెంకటమ్మ అధికారులను వేడుకుంది. వారితో తనకు ప్రాణహాని ఉందని, తనను ఆదుకోవాలని ఆమె కోరింది.

### దర్యాప్తు చేస్తున్నాం.. : తహసీల్దార్ వెంకటస్వామి

మండల కేంద్రంలోని సర్వే నెంబర్ 731 కింద అసైన్డ్ ల్యాండ్ వందల ఎకరాల్లో ఉంది. అందులో రైతులకు కొందరు పంటలు పండించుకునేది వాస్తవమే. వెంకటమ్మ చేసిన ఫిర్యాదు అందింది సంబంధిత అధికారులతో సర్వే చేయించి దర్యాప్తు చేస్తున్నాం. నాటు వేసిన పొలాన్ని చెడగొట్టడం చాలా తప్పు. సంబంధిత అధికారులకు సిఫార్సు చేస్తున్నాను.





# పారదర్శకమైన పాలనకు.. సమాచార హక్కు చట్టం



### కమిషనర్లు బోరెడ్డి అయోధ్య రెడ్డి, పీవీ శ్రీనివాస్ రావు

**వరంగల్ వాయిస్, వరంగల్ :** ప్రభుత్వ పాలనలో పారదర్శకత, అధికార యంత్రాంగంలో జవాబుదారీతనమే సమాచార హక్కు చట్టం ముఖ్య ఉద్దేశమని తెలంగాణ రాష్ట్ర సమాచార హక్కు కమిషనర్లు బోరెడ్డి అయోధ్య రెడ్డి, పీవీ శ్రీనివాసరావులు పేర్కొన్నారు. శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో సమాచార హక్కు చట్టం–2005పై రాష్ట్ర సమాచార కమిషన్ ఆధ్వర్యంలో పీఐఓ, ఆపిలెట్ అధికారులకు అవగాహన సదస్సు జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొనడానికి జిల్లా కలెక్టరేట్ కార్యాలయానికి విచ్చేసిన రాష్ట్ర సమాచార కమిషనర్లకు జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద, జీడబ్ల్యూఎంసీ కమిషనర్ చాహత్ బాజ్ పాయి, డీసీపీలు షేక్ సలీమా, అంకిత్ కుమార్ పూల మొక్కలు, పుష్పగుచ్చాలు అందించి స్వాగతం పలికారు. అనంతరం రాష్ట్ర సమాచార కమిషనర్లు పోలీసు గౌరవ వందనం స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టరేట్ ప్రాంగణంలో వారు మొక్కలు నాటారు. అనంతరం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన సమాచార హక్కు చట్టం అవగాహన సదస్సులో రాష్ట్ర సమాచార హక్కుచట్టం కమిషనర్లు బోరెడ్డి అయోధ్య రెడ్డి, పీవీ శ్రీనివాసరావులు మాట్లాడుతూ సమాచార హక్కు చట్టం పౌరులకు పారదర్శకత, బాధ్యతాయుత పరిపాలన అందించడంలో కీలకమైన సాధనమని తెలిపారు. అవినీతి నిర్మూలనే లక్ష్యంగా సమాచార హక్కు చట్టం అమల్లోకి వచ్చిందన్నారు. ఆర్టీఐ చట్టాన్ని సక్రమంగా అమలు చేస్తే అవినీతి తగ్గిపోతుందని, ప్రజల్లో ప్రభుత్వంపై నమ్మకం పెరుగుతుందని అన్నారు. జిల్లాస్థాయిలో ప్రతి మూడు నెలలకు ఒకసారి అధికారులకు చట్టంపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద మాట్లాడుతూ జిల్లాలో సమాచార హక్కు చట్టాన్ని పటిష్టంగా అమలయ్యేలా అధికారులకు పలు ఆదేశాలు జారీ చేసినట్టు తెలిపారు. జిల్లాలో గత సంవత్సరం నుంచి అపరిష్కృతంగా ఉన్న ఆర్టీఐ అప్పీల్ కేసులను కలెక్టరేట్ లో కమిషన్ ప్రత్యేకంగా పరిష్కారానికి చర్యలు చేపట్టిందన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ సంధ్యారాణి, ఏసీపీ శుభం, డీఆర్ఓ విజయలక్ష్మి, ఆర్డీఓలు, వివిధ శాఖల పీఐఓలు, అప్పీలెట్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# మౌలిక సదుపాయాల కల్పనే ప్రభుత్వ లక్ష్యం

◆ వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు
◆ రూ. 1.50 కోట్ల బీటీ రోడ్డుకు శంకుస్థాపన



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** వర్ధన్నపేట నియోజకవర్గ అభివృద్ధిలో భాగంగా గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ 2వ డివిజన్‌లోని రెడ్డిపురం గ్రామంలో రూ. 1.50 కోట్లతో నిర్మించనున్న బీటీ రోడ్డుకు వర్ధన్నపేట ఎమ్మెల్యే, విశ్రాంత ఐపీఎస్ అధికారి కే.ఆర్. నాగరాజు శంకుస్థాపన చేశారు. ఈ రోడ్డు విజయలక్ష్మి కాలనీ నుంచి సాయి కృప కాలనీ మీదుగా ఎస్ఆర్ఎస్‌పి కెనాల్ వరకు నిర్మిస్తారు. ఈ కార్యక్రమానికి వచ్చిన ఎమ్మెల్యే నాగరాజుకు స్థానిక ప్రజా ప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, మహిళలు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాగరాజు మాట్లాడుతూ, "ప్రతి పౌరుడికి మౌలిక సదుపాయాలు అందించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యం. రెడ్డిపురం గ్రామ ప్రజలు ఎదుర్కొంటున్న రోడ్డు, డ్రైనేజీ సమస్యకు ఈ ప్రాజెక్ట్ శాశ్వత



పరిష్కారం అవుతుంది," అని అన్నారు. పనుల నాణ్యత విషయంలో రాజీ పడకుండా, వేగంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించానని తెలిపారు. గ్రామ అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని, ఇలాంటి ప్రాజెక్టులు మరిన్ని తీసుకురావడానికి ప్రజల సహకారం అవసరమని పిలుపునిచ్చారు. "అభివృద్ధి కేవలం మాటలకే పరిమితం కాకుండా, కార్యరూపంలో కనిపించాలి. అందుకే ఈ రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్నాం," అని అన్నారు. ప్రజల సమస్యలను పరిష్కరించడం, అభివృద్ధి సాధించడమే తన లక్ష్యమని ఆయన పునరుద్ఘాటించారు. ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ లావుడ్య రవి నాయక్, మాజీ కార్పొరేటర్ బానోతు కల్పన సింగిలాల్, ఎనుమాముల ఏఎంసీ డైరెక్టర్ రైతు రాజు, హనుమకొండ మండల అధ్యక్షుడు మాదాసి అజయ్, డివిజన్ అధ్యక్షుడు పొన్నాల రఘు, సోషల్ మీడియా కోఆర్డినేటర్ పుట్ట తిరుపతి, జవహర్ నాయక్, అలాగే రెడ్డిపురం విజయలక్ష్మి కాలనీ అభివృద్ధి కమిటీ సభ్యులు, స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# నందమూరి హరికృష్ణకు ఘన నివాళి

**వరంగల్ వాయిస్, వరంగల్:** తెలుగుదేశం పార్టీ చైతన్య రథసారథి, దివంగత నందమూరి హరికృష్ణ ఏడవ వర్ధంతి సందర్భంగా వరంగల్ తూర్పు నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ నాయకులు ఘన నివాళులర్పించారు. ఇసుక అడ్డ వద్ద హరికృష్ణ చిత్రపటానికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ కార్యక్రమాన్ని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర మాజీ కార్యదర్శి చిలువేరు రవీందర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా రవీందర్ మాట్లాడుతూ హరికృష్ణ రవాణా శాఖ మంత్రిగా ఉన్నప్పుడు మహిళా బస్ కండక్టర్లుగా ఉద్యోగాలు కల్పించి, మహిళా సాధికారతకు కృషి చేశారని అన్నారు. అదే విధంగా, రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి, సబ్సిడీపై ట్రాక్టర్లను అందించారని గుర్తు చేశారు. నందమూరి హరికృష్ణ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర తెలుగు యువత అధ్యక్షుడిగా, పొలిట్ బ్యూరో సభ్యుడిగా, రాజ్యసభ సభ్యుడిగా తెలుగుదేశం పార్టీకి ఎనలేని సేవలు అందించారని ఆయన కొనియాడారు. హరికృష్ణ చేసిన సేవలను ఈ సందర్భంగా స్మరించుకున్నారు. ఈ కార్యక్రమంలో శిరబోయిన రాజు, తౌటం సంపత్ కుమార్, పోలేపాక సాయి కుమార్, కాంద్రాతి రాజు, సుంచు మాధవ్, సింగారపు మురళి తదితరులు పాల్గొన్నారు.



# పిచ్చి మొక్కల తొలగింపు



**వరంగల్ వాయిస్, గణపురం:** ఇటీవల కురిసిన భారీ వర్షాలకు గణపురం మండల కేంద్రంలోని గుడివాడ ప్రాంతంలో పలు ఇళ్లలోకి వర్షపు నీరు చేరింది. ఈ విషయం తెలుసుకున్న పలు పార్టీల నాయకులు ఆ ప్రాంతాన్ని సందర్శించారు. ఈ పర్యటనలో భాగంగా స్థానిక నేతలు నీరు ఇళ్లలోకి చేరడానికి ప్రధాన కారణాన్ని గుర్తించారు. ఊర కాలువలో పెరిగిన పిచ్చి మొక్కలు, చెత్తాచెదారం పేరుకుపోవడం వల్ల నీటి ప్రవాహం అడ్డుపడి, కాలనీలోకి వరదనీరు వచ్చి చేరినట్లు గమనించారు. ఈ విషయాన్ని వారు తక్షణమే ఇరిగేషన్ డిపార్ట్‌మెంట్ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై స్పందించిన ఇరిగేషన్ డీఈ, ఏఈలు ఆ ప్రాంతాన్ని సందర్శించి, త్వరలోనే తగిన చర్యలు తీసుకుంటామని, ఇలాంటి సంఘటనలు మళ్లీ జరగకుండా చూస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రైతులు సిరిగనేని బాబురావు, మోటపోతుల చందర్ గౌడ్, బీజేవైఎం కళాశాల విభాగం రాష్ట్ర కన్వీనర్ మంద మహేష్, బీజేపీ బూత్ అధ్యక్షులు పెండ్యాల శ్రీకాంత్, కాలనీవాసులు పాల్గొన్నారు.

# ఉనికి కోసమే బీజేపీ నేతల ఆరాటం

■ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు సరళ సంపత్ యాదవ్

**వరంగల్ వాయిస్, హనుమకొండ:** బీజేపీ తన ఉనికిని చాటుకోవడానికి ఆరాటపడుతోందని హనుమకొండ జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు బంక సరళ సంపత్ యాదవ్ ఆరోపించారు. శుక్రవారం హనుమకొండలోని 57వ డివిజన్‌లోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆమె మహిళా కాంగ్రెస్ నాయకురాళ్లతో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సరళ సంపత్ యాదవ్ మాట్లాడుతూ, ఉమ్మడి వరంగల్ జిల్లా సరిహద్దులు కూడా తెలియని బీజేపీ వరంగల్, హనుమకొండ జిల్లాల అధ్యక్షులు గంట రవికుమార్, కొలను సంతోష్ రెడ్డిలు వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డిని విమర్శించడం హాస్యాస్పదంగా ఉందని అన్నారు. గత పదేళ్లలో జరగని అభివృద్ధి కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 18 నెలల్లోనే జరిగిందని ఆమె తెలిపారు. "జిల్లాలో అభివృద్ధి జరుగుతుంటే బీజేపీ నేతలు కళ్లు లేని కబోదుల్లా మాట్లాడుతున్నారు," అని ఆమె విమర్శించారు. మామునూరు ఎయిర్‌పోర్ట్, నయీం నగర్ బ్రిడ్జ్, కాజీపేట ఫ్లైఓవర్, కాళోజీ కళాక్షేత్రం, అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ, గ్రేటర్ వరంగల్‌లో రోడ్ల నిర్మాణాలు బీజేపీ నాయకులకు కనిపించడం లేదా



అని ఆమె ప్రశ్నించారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రావుల కిషన్‌కు సరైన అవగాహన లేకుండా ఎమ్మెల్యే రాజేందర్ రెడ్డిని విమర్శించడం దుర్మార్గమని ఆమె మండిపడ్డారు. రావుల కిషన్ చరిత్ర ప్రజలందరికీ తెలుసునని బంక సరళ సంపత్ యాదవ్ ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ సముద్రం లాంటిదని, చిన్నచిన్న విభేదాలు సహజమని అన్నారు. జనహిత పాదయాత్రలో కొండా సురేఖ మురళీధర్ రావుతో కలిసి పాల్గొన్న సంగతి బీజేపీ నేతలకు తెలియదా అని ఆమె ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో జిల్లా మహిళా నాయకురాళ్లు దువ్వ రేవతి, కొంటే సుకన్య, తాళ్లపల్లి మేరీ, బొంత సుజాత, తేళ్ల సుగుణ, అల్లం మున్నీ, కేసరి ఇందిరా, బొల్లు లలిత, ఎస్ కవిత, సునీత, రమ్య, అను, రజిత తదితరులు పాల్గొన్నారు.

# డిస్నీల్యాండ్ లో జాతీయ క్రీడా దినోత్సవ వేడుకలు



**వరంగల్ వాయిస్, దామెర :** మండలంలోని ఒగ్లాపూర్‌లోని డిస్నీల్యాండ్ హైస్కూల్‌లో మేజర్ ధ్యాన్ చంద్ జయంతిని పురస్కరించుకుని జాతీయ క్రీడా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాఠశాల ముఖ్య సలహాదారులు దయ్యాల మల్లయ్య, దయ్యాల సదయ్య, బాలుగు లక్ష్మి నివాసంలు మేజర్ ధ్యాన్ చంద్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పాఠశాల ముఖ్య సలహాదారు దయ్యాల సదయ్య మాట్లాడుతూ క్రీడలకు ప్రాధాన్యత ఇచ్చేవారు ఆరోగ్యంగా ఉంటారని, వ్యాధుల నుంచి దూరంగా ఉంటారని అన్నారు. ప్రతి ఒక్కరూ రోజూ వాకింగ్, రన్నింగ్ వంటి శారీరక శ్రమ చేయడం అలవాటు చేసుకోవాలని సూచించారు. మేజర్ ధ్యాన్ చంద్ దేశానికి అందించిన సేవలను ఆయన కొనియాడారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్లు బి.శోభారాణి, దయ్యాల రాకేష్ భాను, దయ్యాల దినేష్ చందర్ పాల్గొన్నారు. ఈ వేడుకలను విజయవంతం చేసిన ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్లు బి.రాజ్‌కుమార్, ఎం.తిరుపతిరెడ్డి, టి.శ్రీనివాస్, బి.సునీత, గౌతమిలను పాఠశాల యాజమాన్యం అభినందించింది.

# బాధిత కుటుంబాలకు పరామర్శ



**వరంగల్ వాయిస్, తొర్రూరు:** పాలకుర్తి శాసనసభ్యురాలు మామిడాల యశస్విని రెడ్డి, టీపీసీసీ ఉపాధ్యక్షురాలు ఝాన్సీ రాజేందర్ రెడ్డి ఆదేశాల మేరకు తొర్రూరు మున్సిపాలిటీ పరిధిలోని 16వ వార్డులో ఇటీవల మరణించిన పేర్ల పుల్లయ్య మృతదేహానికి కాంగ్రెస్ నాయకులు నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు పుల్లయ్య కుటుంబసభ్యులను పరామర్శించారు. అలాగే, మూడవ వార్డులో పరమపదించిన తోట భరత్ కుటుంబసభ్యులను, చామకూరి లలితా సోమయ్యను కూడా కాంగ్రెస్ నాయకులు పరామర్శించి తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పాలకుర్తి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు డాక్టర్ పొనుగోటి సోమేశ్వరరావు, ఏఎంసీ డైరెక్టర్ కందాడి అచ్చిరెడ్డి, 16వ వార్డు మాజీ కౌన్సిలర్ బిజ్జాల అనిల్, పట్టణ మాజీ వార్డు సభ్యులు జంజరాల మనోహర్, కల్లూరి కుషాల్, జిలకర సురేందర్, స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# 100 డయల్‌ను దుర్వినియోగం చేస్తే కఠిన చర్యలు



**వరంగల్ వాయిస్, కాశిబుగ్గ :** 100 డయల్‌ను అనవసరంగా ఉపయోగించి, పోలీసుల సమయాన్ని వృథా చేసిన వ్యక్తిపై ఎనుమాముల పోలీసులు కేసు నమోదు చేసి, ఎమ్మార్వో ముందు బైండోవర్ చేశారు. ఎనుమాముల, బాలాజీ నగర్‌కు చెందిన కొండపల్లి రాజ్‌కుమార్ (30), బుడిగ జంగాల అనే వ్యక్తి ఖాళీగా ఉంటూ, రాత్రి వేళల్లో మద్యం తాగి 100 డయల్‌కు ఫోన్ చేసి బూతులు తిడుతూ పోలీసులను వేధించడమే కాకుండా, స్థానికులను కూడా భయభ్రాంతులకు గురి చేస్తున్నాడు. ఈ నేపథ్యంలో ఎనుమాముల ఇన్‌స్పెక్టర్ జవ్వాజి సురేష్ రాజ్‌కుమార్ తండ్రి సాంబయ్యను పిలిచి కౌన్సెలింగ్ ఇచ్చారు. అనంతరం రాజ్‌కుమార్‌ను వరంగల్ ఎమ్మార్వో ముందు బైండోవర్ చేశారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ జవ్వాజి సురేష్ ప్రజలకు ఒక హెచ్చరిక జారీ చేశారు. 100 డయల్‌ను ప్రజలు అత్యవసర పరిస్థితుల్లో మాత్రమే సద్వినియోగం చేసుకోవాలని, అనవసరంగా ఉపయోగించి పోలీసుల విలువైన సమయాన్ని వృథా చేస్తే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## తల్లిపాలు దానం చేసిన పల్నాటి లిఖిత





**వరంగల్ వాయిస్, చెన్నారావుపేట :** మానవత్వానికి నిలువుటద్దంలా నిలిచింది చెన్నారావుపేట మండలం లింగాపురం గ్రామానికి చెందిన పల్నాటి లిఖిత. తన మూడు నెలల పాపకు సరిపడినన్ని పాలు ఇచ్చిన అనంతరం మిగిలిన పాలను పాల స్టోరేజ్ బ్యాగుల్లో భద్రపరిచి, వాటిని హనుమకొండలోని ప్రభుత్వ మాతృశిశు సంరక్షణ కేంద్రం (ఎంసీహెచ్)లో దానం చేసింది. లిఖిత చేసిన ఈ దానం వల్ల, వివిధ కారణాల చేత తల్లిపాలు అందని శిశువులకు అవసరమైన పోషకాలు అందుతాయి. ఈ సందర్భంగా ఆసుపత్రి వైద్యులు, సిబ్బంది లిఖిత సేవను ప్రశంసించారు. శిశువుల ఆరోగ్యాన్ని కాపాడటానికి తల్లిపాల దానం ఎంత ముఖ్యమో లిఖిత ఉదాహరణ మరోసారి స్పష్టం చేసిందని వారు పేర్కొన్నారు. లిఖిత మానవీయ చర్య ఇతర తల్లులకు స్ఫూర్తినిస్తుందని ఆసుపత్రి వర్గాలు తెలిపాయి.

## రోడ్డుపై వరినాట్లు వేసి గ్రామస్థుల నిరసన



**వరంగల్ వాయిస్, నడికూడ :** మండలంలోని కౌకొండ గ్రామానికి వెళ్లే రోడ్డును అసంపూర్తిగా వదిలేయడంపై ఆగ్రహించిన గ్రామస్థులు వినూత్న రీతిలో నిరసన తెలిపారు. రోడ్డుపై నిలిచిన వర్షపు నీటిలో వరినాట్లు వేసి ప్రభుత్వానికి తమ నిరసనను వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వివిధ పార్టీల నాయకులు మాట్లాడుతూ, రెండు సంవత్సరాల క్రితం బీటీ రోడ్డుగా మార్చడానికి ఇరువైపులా కంకర వేసి పనులు మధ్యలో ఆపివేశారని అన్నారు. రాత్రి కురిసిన వర్షానికి రోడ్డుపై నీరు నిలవడంతో గ్రామ పంచాయతీ కార్యాలయం వెళ్లే ప్రజలు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. స్థానిక సమస్యలను కూడా కాంగ్రెస్ ప్రభుత్వం పరిష్కరించడం లేదని, ప్రజలు రోడ్ల మీదకు వచ్చి ఆందోళన చేయాల్సిన పరిస్థితి ఏర్పడిందని నాయకులు మండిపడ్డారు. రోడ్డు పనులు పూర్తి చేయాలని పలుమార్లు అధికారులకు విన్నవించినా ఫలితం లేదని వారు తెలిపారు. ఇప్పటికైనా అధికారులు స్పందించకపోతే పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు. ఈ నిరసన కార్యక్రమంలో బీజేపీ, బీఎస్పీ, డీఎస్పీ నాయకులు చుక్క రత్నాకర్, మేకల నరేష్, ఇనుగాల దిలీప్, చుక్క సూర్యం, మేకల విష్ణు, గోల్కొండ చంటి తదితరులు పాల్గొన్నారు.

## పూజారి సాంబయ్యకు నివాళి



**వరంగల్ వాయిస్, పరకాల:** పట్టణానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు పూజారి సాంబయ్య (68) గురువారం అనారోగ్యంతో మృతిచెందారు. ఆయన మృతితో స్థానికంగా విషాదఛాయలు అలుముకున్నాయి. ఈ విషయం తెలుసుకున్న భూపాలపల్లి మాజీ శాసనసభ్యుడు, మాజీ చీఫ్ విప్ గండ్ర వెంకటరమణారెడ్డి సాంబయ్య భౌతిక కాయానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన కుటుంబసభ్యులను ఓదార్చి, ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ పొరండ్ల సంతోష్, ఆముదాలపల్లి మల్లేశం గౌడ్, మాజీ ఎంపీపీ ఒంటెరు రామ్మూర్తి, మాజీ ఎంపీటీసీ కొత్తపల్లి రవి, మడికొండ శీను, బొచ్చు భాస్కర్, ఏకు రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

# ఉపాధ్యాయ వృత్తిలో సంతృప్తి వెలకట్టలేనిది

◆ కుర్రెముల యాదగిరి



**వరంగల్ వాయిస్, రఘునాథపల్లి :** ప్రయోజకుడైన శిష్యుడు ఎదురై పలకరించినప్పుడు కలిగే ఆనందం అనిర్వచనీయమని, అందుకే ఉపాధ్యాయ వృత్తిలో లభించే సంతృప్తి వెలకట్టలేనిదని పదవీ విరమణ చేసిన ఉపాధ్యాయుడు కుర్రెముల యాదగిరి అన్నారు. 36 సంవత్సరాల ఉపాధ్యాయ జీవితం అనంతరం రఘునాథపల్లి మండలం మండలగూడెం ప్రభుత్వ పాఠశాల స్కూల్ అసిస్టెంట్‌గా పదవీ విరమణ చేసిన సందర్భంగా శుక్రవారం ఏర్పాటు చేసిన వీడ్కోలు సభలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా తనను అభినందించిన ప్రతి ఒక్కరికీ యాదగిరి కృతజ్ఞతలు తెలిపారు. తాను పనిచేసిన కోలుకొండ, నిడిగొండ, పెద్దమడురు, చించనకోట, మండలగూడెం తదితర పాఠశాలల్లో సహకరించిన సహచర ఉపాధ్యాయులు, గ్రామస్థుల ప్రోత్సాహాన్ని ఆయన గుర్తు చేసుకున్నారు. సమావేశంలో పాల్గొన్న పూర్వ ఏపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఏ. నరసింహ రెడ్డి, టీపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డి.శ్రీనివాస్, జిల్లా అధ్యక్షుడు ఎన్.రాజు, మండల విద్యాధికారులు మాట్లాడుతూ యాదగిరి ఉపాధ్యాయ వృత్తిలో కొనసాగుతూనే బహుముఖ ప్రజ్ఞాశాలిగా రాణించారని కొనియాడారు. పరపతి సంఘాల ద్వారా పొదుపు గురించి ప్రోత్సహించారని, లయన్స్ క్లబ్ ద్వారా సేవా కార్యక్రమాలు చేపట్టి పేదలకు సాయం చేశారని తెలిపారు. వృత్తిపరమైన సంఘ నాయకుడిగా, విద్యార్థుల అభిమానం చూరగొన్న యాదగిరి అభినందనీయులని వక్తలు ప్రశంసించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రాజుపాల్ రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో రఘునందన్ రెడ్డి, నర్మేట మండల విద్యాధికారి ఎం.ఆయిలయ్య, లింగాలఘనపూర్ మండల విద్యాధికారి విష్ణుమూర్తి, లయన్స్ ఇంటర్నేషనల్ పూర్వ జిల్లా గవర్నర్ కన్న పరశురాములు, కాంప్లెక్స్ హెడ్మాస్టర్ భారతి రవీందర్, పెన్షనర్స్ అసోసియేషన్ నాయకుడు రామస్వామి తదితరులు ప్రసంగించారు. ఈ సందర్భంగా యాదగిరి, మాధవి దంపతులను పాఠశాల విద్యార్థులు, గ్రామస్థులు, వివిధ సంఘాల నాయకులు, బంధు మిత్రులు ఘనంగా సన్మానించారు.

## వైభవంగా అష్టలక్ష్మి కుంకుమార్చన



**వరంగల్ వాయిస్, చిట్యాల :** జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని చిట్యాల మండల కేంద్రంలో ఉన్న శ్రీ ప్రసన్న ఆంజనేయస్వామి దేవాలయంలో గణపతి నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని మూడవ రోజు శుక్రవారం అష్టలక్ష్మి కుంకుమార్చన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ పూజా కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో భక్తులు, ముఖ్యంగా మహిళలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకులు పెద్దోజు రాకేష్ చారి మాట్లాడుతూ ఈ అష్టలక్ష్మి కుంకుమార్చనతో భక్తులకు ఆయురారోగ్యాలు, అష్టైశ్వర్యాలు, భోగభాగ్యాలు లభిస్తాయని అన్నారు. ప్రతి కుటుంబం, గ్రామం సుఖసంతోషాలతో, సస్యశ్యామలంగా ఉండాలని, గణపతి అనుగ్రహం ఎల్లవేళలా ఉండాలని కోరుతూ ఈ పూజలు నిర్వహించినట్లు తెలిపారు. భక్తులు ప్రతి సంవత్సరం ఇలాంటి ఉత్సవాలను నిర్వహించి అష్టలక్ష్మి దేవిని ఆరాధించాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో మహిళా భక్తులు, ఆలయ కమిటీ చైర్మన్ రంగాచారి పాల్గొన్నారు.

## క్రీడలతోనే సత్ప్రవర్తన సాధ్యం



**వరంగల్ వాయిస్, జనగామ:** క్రీడలతోనే మంచి ప్రవర్తన, క్రమశిక్షణ సాధ్యమవుతాయని జనగామ సోషల్ వెల్ఫేర్ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు అన్నారు. శుక్రవారం జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా నెహ్రూ యువ కేంద్రం, మై భారత్ ఆధ్వర్యంలో సోషల్ వెల్ఫేర్ బాయ్స్ జూనియర్ కళాశాలలో నిర్వహించిన వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. భారత హాకీ దిగ్గజం, 'హాకీ మాంత్రికుడు' ధ్యాన్ చంద్ జయంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ, ధ్యాన్ చంద్ స్ఫూర్తితో భారత క్రీడాకారులు ప్రపంచ వేదికలపై దేశ ఖ్యాతిని చాటాలని ఆకాంక్షించారు. అనంతరం ఆయన క్రీడా పోటీలను ప్రారంభించారు. తల్లిదండ్రులు తమ పిల్లలను సత్ప్రవర్తన కలిగిన యువకులుగా తీర్చిదిద్దేందుకు ఉపాధ్యాయులతో కలిసి కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నెహ్రూ యువ కేంద్రం పూర్వ క్రీడోత్సవాల ఆర్గనైజర్ మంద రాజేష్, పీడీ కిషన్, వైస్ ప్రిన్సిపాల్ నరసింహులు, జూనియర్ ప్రిన్సిపల్ రవీందర్, స్టాఫ్ ప్రెసిడెంట్ కే.వేణుమాధవరావు, ఫుట్‌బాల్ కోచ్ లింగయ్య నాయక్, పీటీ వేణు తదితరులు పాల్గొన్నారు.

# జీపీ కార్మికులకు గ్రీన్ ఛానల్ తో జీతాలు ఇవ్వాలి

◆ బొట్ల చక్రపాణి డిమాండ్




**వరంగల్ వాయిస్, హనుమకొండ:** గ్రామపంచాయతీ కార్మికులకు ప్రతినెల 5వ తేదీలోపు గ్రీన్ ఛానల్ ద్వారా వేతనాలు ఇస్తామన్న ముఖ్యమంత్రి హామీని తక్షణమే అమలు చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షులు టి. ఉప్పలయ్య, తెలంగాణ గ్రామ పంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) జిల్లా గౌరవ అధ్యక్షులు బొట్ల చక్రపాణి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి, కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాలో ఆన్‌లైన్‌లో పేర్లు నమోదు కాని కార్మికులను తక్కువ వేతనాలతో కొనసాగిస్తూ, తొలగిస్తామని బెదిరింపులకు పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వారి పేర్లను తక్షణమే ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని కోరారు. వినాయక చవితి, దసరా పండుగల సందర్భంగా అదనపు పని చేయించుకుంటున్నప్పటికీ, అదనపు వేతనాలు ఇవ్వడం లేదని మండిపడ్డారు. అనేక గ్రామపంచాయతీలలో సిబ్బందికి దుస్తులు, చెప్పులు, నూనెలు, గ్లౌజులు, సబ్బులు, వర్షం కోట్లు వంటి కనీస రక్షణ పరికరాలు కూడా ఇవ్వడం లేదని, దీంతో ప్రభుత్వం వారి రక్షణ కల్పించడంలో పూర్తిగా విఫలమైందని అన్నారు. ప్రతి నెల 5 లోపు గ్రీన్ ఛానల్ ద్వారా వేతనాలు ఇవ్వాలి. వేతనాలు రూ. 26,000 కు పెంచాలి. గ్రామపంచాయతీ కార్మికులందరికీ ఉద్యోగ భద్రత కల్పించి, పర్మినెంట్ చేయాలి. కారోబార్, బిల్ కలెక్టర్లకు స్పెషల్ స్టేటస్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ సమస్యలపై ప్రభుత్వం సానుకూలంగా స్పందించకపోతే, సంఘం ఆధ్వర్యంలో పెద్దఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని వారు హెచ్చరించారు. ఈ ధర్నాలో యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి పల్లె రామన్న, నాయకులు మంద మల్లేశం, బండ సాంబయ్య, మాట్ల భాస్కర్, ఓనాపాకల రాజయ్య, రంజిత్, గట్టు కొమరయ్య, గాజుల సమ్మయ్య, ఎ. వెంకటేశ్వర్లు, రామంచ పోచయ్య, సుశీల, ఐలమ్మ, గడిపే సుగుణ, ఇసంపల్లి రాధ, మారపల్లి సుకన్య తదితరులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల్లో వేగం పెంచాలి

## ◆ జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్



**వరంగల్ వాయిస్, జనగామ:** నిరుపేదల సొంతింటి కలను నిజం చేసేందుకు ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు జిల్లాలో వేగంగా సాగుతున్నాయని జనగామ జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ తెలిపారు. శుక్రవారం ఆయన రఘునాథపల్లి మండలం మేకలగట్టు గ్రామంలో జరుగుతున్న ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ లబ్ధిదారులతో మాట్లాడారు. ఇళ్ల నిర్మాణాలు త్వరగా పూర్తి చేయాలని సూచించారు. ఇళ్లకు అవసరమైన ఇసుకను ప్రభుత్వమే ఉచితంగా అందిస్తుందని, మేస్త్రీలు కూడా నిర్ణయించిన ధరల ప్రకారమే పని చేయాలని, లబ్ధిదారులు వారికి ఎక్కువ డబ్బులు చెల్లించవద్దని ఆయన స్పష్టం చేశారు. ఇంటి నిర్మాణం చేసుకుంటున్న వారికి ప్రభుత్వం దశలవారీగా నిధులను విడుదల చేస్తుందని తెలిపారు. ఇసుక, మొరం వంటి సామగ్రి విషయంలో ఏమైనా సమస్యలు ఎదురైతే వెంటనే అధికారుల దృష్టికి తీసుకురావాలని కలెక్టర్ సూచించారు. అనంతరం మేకలగట్టు నుంచి జీబీ తండాకు వెళ్లే రోడ్డుపై నిర్మించిన బ్రిడ్జి వద్ద విద్యుత్, ఇతర మరమ్మత్తు పనులను వేగంగా పూర్తి చేసి, ప్రయాణికులకు అందుబాటులోకి తీసుకురావాలని ఆర్ అండ్ బి, విద్యుత్ శాఖ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. మండల తహసీల్దార్, ఎంపీడీఓ, ఆర్ అండ్ బీ, విద్యుత్ శాఖ అధికారులు పాల్గొన్నారు.

# డ్రంకెన్ డ్రైవ్ కేసులో ఇద్దరికి జైలు

**వరంగల్ వాయిస్, హనుమకొండ :** వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్ ఆదేశాల మేరకు వరంగల్ ట్రాఫిక్ ఏసీపీ సత్యనారాయణ పర్యవేక్షణలో శుక్రవారం హనుమకొండ ట్రాఫిక్ పోలీసులు నిర్వహించిన డ్రంకెన్ డ్రైవ్ తనిఖీల్లో మొత్తం 25 మంది పట్టుబడ్డారు. పట్టుబడిన వారిని మేజిస్ట్రేట్ ఏ. వేణుగోపాల్ ఎదుట హాజరుపరచగా, వారిలో ఇద్దరికి జైలు శిక్ష విధించినట్లు హనుమకొండ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ జి. సీతారెడ్డి తెలిపారు. బంగారు రమేశ్, పల్లికొండ రాజేందర్ లకు రెండేసి రోజుల జైలు శిక్ష విధించారు. మిగతా 23 మందికి రూ. 26,400 జరిమానా విధించారు. అలాగే, డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనం నడిపిన నలుగురిని కూడా కోర్టులో హాజరుపరచగా, వారికి రూ. 3,200 జరిమానా విధించినట్లు ఇన్‌స్పెక్టర్ సీతారెడ్డి పేర్కొన్నారు.

## వరంగల్ లో ముగ్గురికి జైలు శిక్ష..

**వరంగల్ వాయిస్, కాశిబుగ్గ :** నగరంలో డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలను వరంగల్ పోలీసులు ముమ్మరం చేశారు. వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్ ఐపీఎస్, అడిషనల్ డీసీపీ ఆర్. ప్రభాకర్ రావు, ఏసీపీ టి. సత్యనారాయణల పర్యవేక్షణలో శుక్రవారం నిర్వహించిన డ్రంకెన్ డ్రైవ్ తనిఖీల్లో మొత్తం 22 మంది పట్టుబడ్డారు. పట్టుబడిన వారిని మేజిస్ట్రేట్ అబ్బోజు వేంకటేశం ఎదుట హాజరుపరచగా, ముగ్గురికి రెండేసి రోజుల జైలు శిక్ష పడింది. రాపల్లి పరమేశ్వర్, మేడిపల్లి రామారావు, హంస కళ్యాణ్ లను హుజురాబాద్ సబ్‌జైలుకు తరలించారు. మిగిలిన 18 మందికి రూ. 20,400 జరిమానా విధించారు. డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడిన వాహనదారులందరికీ చట్టపరమైన చర్యలు తప్పవని వరంగల్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ కె. సుజాత హెచ్చరించారు.

# డీఈఓ రంగయ్య నాయుడుతో వడుప్సా ప్రతినిధుల భేటీ



**వరంగల్ వాయిస్, వరంగల్ :** వరంగల్ జిల్లా విద్యాశాఖ అధికారి (డీఈఓ)గా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన రంగయ్య నాయుడును వడుప్సా (ట్రస్మా) వరంగల్ జిల్లా గౌరవ అధ్యక్షుడు ఆడెపు శ్యామ్ ఆధ్వర్యంలో ప్రతినిధులు శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వడుప్సా ప్రతినిధులు డీఈఓ రంగయ్య నాయుడుకు పూల బొకే, శాలువా అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. బడ్జెట్ ప్రైవేట్ పాఠశాలలు ఎదుర్కొంటున్న సమస్యలపై వారు డీఈఓతో చర్చించారు. సమస్యలను విన్న డీఈఓ సానుకూలంగా స్పందించి తగిన సలహాలు, సూచనలు ఇచ్చారని వడుప్సా ప్రతినిధులు తెలిపారు. ఈ కార్యక్రమంలో వడుప్సా వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి బిల్లా రవి, కోశాధికారి ఠాగూర్ జ్ఞానేశ్వర్ సింగ్, ముఖ్య సలహాదారు కోడం శ్రీధర్, వరంగల్ జోన్ అధ్యక్షులు కూచన క్రాంతి కుమార్, ఖిలా వరంగల్ జోన్ అధ్యక్షులు ముక్కెర రవీందర్, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ ఆడెపు వెంకటేశ్వర్లు, జిల్లా అకాడమిక్ కన్వీనర్ మడిపల్లి రాజు, రాష్ట్ర నాయకులు సంగా వెంకట్రాజం, వరంగల్ జోన్ కోశాధికారి కూరపాటి మోహన్, ఖిలా వరంగల్ జోన్ కోశాధికారి గోపు ప్రవీణ్, ఉపాధ్యక్షులు విలాసాగరం విశ్వనాథ్, ఆర్గనైజింగ్ సెక్రటరీ ముల్క శరత్ బాబు, జోన్ ప్రతినిధులు కూసురి శ్రీనివాస్, బండి చక్రపాణి, వడిచర్ల ప్రసాద్, డి.నరసింహ స్వామి, కనుకుంట్ల వేణుగోపాల్, చెన్నూరి అనిల్ పాల్గొన్నారు.

# యువతి దారుణ హత్య

## క్షుద్ర పూజల అనుమానం



**వరంగల్ వాయిస్, భూపాలపల్లి :** జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో ఒక యువతి దారుణ హత్యకు గురికావడం కలకలం రేపింది. కాటారం మండలం మేడిపల్లి గ్రామ సమీపంలోని కాటారం–భూపాలపల్లి జాతీయ రహదారి పక్కన ఉన్న అటవీ ప్రాంతంలో శుక్రవారం కుళ్లిపోయిన యువతి మృతదేహం లభ్యమైంది. మృతదేహం వద్ద లభించిన ఆధార్ కార్డు ఆధారంగా మృతురాలిని చిట్యాల మండలం ఒడితల గ్రామానికి చెందిన కప్పల వర్షిణి (22)గా పోలీసులు గుర్తించారు. ఈ నెల 6న చిట్యాల పోలీస్ స్టేషన్‌లో వర్షిణి కనిపించలేదని మిస్సింగ్ కేసు నమోదైనట్లు పోలీసులు తెలిపారు. మృతదేహం పక్కన పసుపు, కుంకుమ, నిమ్మకాయలు ఉండటంతో క్షుద్రపూజలు చేసి బలి ఇచ్చారా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. మృతదేహం లభించిన తీరు చూస్తుంటే అఘాయిత్యం చేసి హత్య చేసినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. ఈ ఘటనపై కాటారం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించారు.

# పర్యావరణ పరిరక్షణకు మొక్కలు పెంచాలి

**వరంగల్ వాయిస్, కాశిబుగ్గ :** పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని ఓ సిటీ రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీధర్ రెడ్డి పిలుపునిచ్చారు. 'గుడ్ మార్నింగ్ ఫ్రెండ్స్' కార్యక్రమంలో భాగంగా ఓ సిటీలోని వివిధ క్లబ్‌హౌస్‌లు, పార్కుల్లో సుమారు 300 పండ్ల మొక్కలు, పూల మొక్కలను నాటారు. ఈ సందర్భంగా శ్రీధర్ రెడ్డి మాట్లాడుతూ భవిష్యత్తులో స్వచ్ఛమైన ఆక్సిజన్‌ను కూడా కొనుక్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. మొక్కలు నాటడం వల్ల పర్యావరణ సమతుల్యత ఏర్పడి, మానవ మనుగడకు దోహదపడుతుందని అన్నారు. ప్రతి ఒక్కరూ తమ ఇంటి పరిసరాల్లో కనీసం ఒక మొక్కనైనా నాటాలని కోరారు. ఈ మొక్కలు నాటే కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు సొల్లేటి శ్రీధర్ రెడ్డి, ఉపాధ్యక్షులు గై సంజీవరావు, రామా వెంకటనారాయణ, ప్రధాన కార్యదర్శి దంతుల శోభన్, కమిటీ సభ్యులు కొనగల శ్రీనివాస్, దారం శ్రీరాములు, గంప అశోక్ కుమార్, సూర్యదేవర రాజమౌళి, కూకట్ల సత్యనారాయణ, కంచ గణేష్, కంచ కుమార్, రవి తదితరులు పాల్గొన్నారు.



# బుదారపు లావణ్యకు 'తెలుగు తేజం' జాతీయ పురస్కారం



**వరంగల్ వాయిస్, జనగామ:** తెలుగు భాషా పితామహుడు గిడుగు రామ్మూర్తి జయంతిని పురస్కరించుకుని ఈ నెల 31న ఆంధ్రప్రదేశ్‌లోని పల్నాడులో అందజేయనున్న 'తెలుగు తేజం' జాతీయ పురస్కారానికి జనగామ జిల్లాకు చెందిన ప్రముఖ కవయిత్రి బుదారపు లావణ్య ఎంపికయ్యారు. ఈ విషయాన్ని నిర్వాహక సంస్థ అంతర్జాతీయ శ్రీశ్రీ కళావేదిక మంగళవారం అధికారికంగా ప్రకటించింది. నిరంతరంగా సాహితీ సృజన చేస్తున్న తెలుగు కవులు, కవయిత్రులను ఈ పురస్కారానికి ఎంపిక చేసినట్లు శ్రీశ్రీ కళావేదిక జాతీయ అధ్యక్షుడు డాక్టర్ కత్తిమండ ప్రతాప్, లావణ్యకు పంపిన ఆహ్వాన పత్రికలో తెలిపారు. గత దశాబ్ద కాలంగా వివిధ అంశాలపై కవితలు, పాటలు రాస్తూ, స్వీయ గానంతో వాటిని సామాజిక మాధ్యమాలు, యూట్యూబ్‌లో ప్రచురిస్తూ సాహిత్యాభిమానుల మన్ననలు పొందుతున్న లావణ్యకు ఈ అవార్డు రావడం పట్ల జిల్లాలోని కవులు, కళాకారులు, సాహితీ సంస్థలు హర్షం వ్యక్తం చేశాయి. ఈ సందర్భంగా కవులు కళాకారుల ఐక్య వేదిక అధ్యక్షులు జి.కృష్ణ, అభినందన కల్చరల్ సొసైటీ అధ్యక్షులు అయిలా సోమ నరసింహాచారి, కవి హృదయం సాహిత్య వేదిక అధ్యక్షులు పెట్లోజు సోమేశ్వరాచారి, శ్రీశ్రీ కళావేదిక జనగామ జిల్లా అధ్యక్షులు లగిశెట్టి ప్రభాకర్, పొట్టబత్తిని భాస్కర్, డాక్టర్ వేముల సదానందం, గడ్డం మనోజ్, తాళ్లపల్లి లక్ష్మణ్ గౌడ్, కొట్టె శ్రీలత, త్రిపురారి పద్మ, వరూధిని తదితరులు లావణ్యకు అభినందనలు తెలిపారు.

# విద్యార్థులకు బ్యాగుల పంపిణీ



**వరంగల్ వాయిస్, ఆత్మకూరు:** మండలంలోని నీరుకుల్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు ఎన్నారైలు పోలిశెట్టి చంద్రశేఖర్, విజయకృష్ణల సౌజన్యంతో స్కూల్ బ్యాగులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమాన్ని నిర్వహించడానికి సహకరించిన పాఠశాల గణిత శాస్త్ర ఉపాధ్యాయుడు దహగం రమేష్‌ను, అలాగే దాతలైన చంద్రశేఖర్, విజయకృష్ణలను పలువురు అభినందించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు నిర్మల మాట్లాడుతూ విద్యార్థులు బాగా చదువుకుని ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. తాము చదువుకున్న గ్రామానికి, కన్న తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని ఆమె విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు సుకన్య, పుష్ప, రమేష్, దమయంతి, సంజీవ్ కుమార్, కోటి, సురేష్, రాము తదితరులు పాల్గొన్నారు.

# విశ్వ సాహితి కళావేదిక జిల్లా అధ్యక్షుడిగా రాజేంద్ర ప్రసాద్



**వరంగల్ వాయిస్, జనగామ:** విశ్వ సాహితి కళావేదిక జనగామ జిల్లా అధ్యక్షుడిగా కవి, ప్రముఖ చిత్రకారుడు మసురం రాజేంద్ర ప్రసాద్‌ను నియమించినట్లు కళావేదిక చైర్మన్ కె. రామావతి ఒక ప్రకటనలో తెలిపారు. సాహిత్య, సాంస్కృతిక, సామాజిక సేవా కార్యక్రమాలను ప్రోత్సహించాలనే లక్ష్యంతో ఈ వేదికను ప్రారంభించామని ఆమె పేర్కొన్నారు. రాజేంద్ర ప్రసాద్ నియామకం పట్ల ఆకాంక్షను వ్యక్తంచేస్తూ, ఆయన నిరంతరం సాహిత్య, సాంస్కృతిక, సామాజిక సేవా కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొనాలని రామావతి ఆకాంక్షించారు. ఈ సందర్భంగా రాజేంద్ర ప్రసాద్.. రామావతికి కృతజ్ఞతలు తెలిపారు. రాజేంద్ర ప్రసాద్ నియామకం పట్ల జనగామ జిల్లాలోని కవులు, కళాకారులు, సాహితీ సంస్థలు హర్షం వ్యక్తం చేశాయి. ఈ నియామకంపై కవులు కళాకారుల ఐక్య వేదిక అధ్యక్షులు జి. కృష్ణ, అభినందన కల్చరల్ సొసైటీ అధ్యక్షులు అయిలా సోమనరసింహాచారి, కవి హృదయం సాహిత్య వేదిక అధ్యక్షులు పెట్లోజు సోమేశ్వరాచారి, తెరాస జిల్లా అధ్యక్షులు పానుగంటి రామమూర్తి, శ్రీశ్రీ కళావేదిక జనగామ జిల్లా అధ్యక్షులు లగిశెట్టి ప్రభాకర్, పొట్టబత్తిని భాస్కర్, డాక్టర్ వేముల సదానందం, జేఎస్కే మ్యూజికల్ రికార్డింగ్ స్టూడియో, చిలుమోజు సాయికిరణ్, తెలంగాణ గౌడ రచయితల సంఘం గడ్డం మనోజ్, తాళ్లపల్లి లక్ష్మణ్ గౌడ్, కవులు మాన్యపు భుజేందర్, అంకాల సోమయ్య, మ్యూజిక్ ఆనంద్ తదితరులు రాజేంద్ర ప్రసాద్‌కు అభినందనలు తెలిపారు.

# తాటికొండ రవికిరణ్ గౌడ్ కు సన్మానం



**వరంగల్ వాయిస్, భూపాలపల్లి :** భూపాలపల్లి జిల్లా బీజేపీ ప్రధాన కార్యదర్శిగా నూతనంగా నియమితులైన తాటికొండ రవికిరణ్ గౌడ్‌ను పరకాల నియోజకవర్గం భారతీయ జనతా పార్టీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా పరకాల నాయకులు రవికిరణ్ గౌడ్‌కు పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సత్కరించారు. జిల్లాలో పార్టీని బలోపేతం చేసేందుకు సమిష్టిగా కృషి చేయాలని ఈ సందర్భంగా తాటికొండ రవికిరణ్ గౌడ్ బీజేపీ నాయకులకు పిలుపునిచ్చారు. కార్యకర్తలను, ప్రజలను పార్టీ వైపు ఆకర్షించడానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. పరకాల నియోజకవర్గంలో పార్టీ ఎదుగుదలకు తనవంతు సహకారం అందిస్తానని ఆయన హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షులు గురిజాల శ్రీరామ్ రెడ్డి, ముత్యాల శ్రీనివాస్ గౌడ్, పరకాల అసెంబ్లీ కన్వీనర్ ములక ప్రసాద్, దామెర మండల అధ్యక్షులు వెల్పుల రాజ్‌కుమార్, గీసుగొండ మండల అధ్యక్షులు చొక్కం శ్రీనివాస్, రాజశేఖర్, బత్తుల సుమంత్ తదితరులు పాల్గొన్నారు.

# గణపతి రూపంలో గణపేశ్వరుడు



**వరంగల్ వాయిస్, గణపురం :** కాకతీయుల కళా క్షేత్రం శ్రీ భవాని సహిత గణపేశ్వరాలయం కోటగుళ్లలో వినాయక చతుర్థి నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని శుక్రవారం కోటగుళ్ల పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో గణపేశ్వరుడిని గణపతి రూపంలో ప్రత్యేకంగా అలంకరించారు. ప్రతి ఏడు వినాయక చతుర్థి నవరాత్రుల్లో స్వామివారిని గణపతి రూపంలో అలంకరించడం ఆనవాయితీగా వస్తుంది. అందులో భాగంగా స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించి వివిధ రకాల పూలతో పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు జూలపల్లి నాగరాజు భక్తులకు ఆశీర్వచనాలు, తీర్థ ప్రసాదాలను అందజేశారు.

# 30న ఓటరు జాబితాపై అవగాహన



**వరంగల్ వాయిస్, నడికూడ :** తెలంగాణ రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు గ్రామ పంచాయతీల ఎన్నికల నిర్వహణ కోసం ముసాయిదా ఓటర్ల జాబితాపై అన్ని రాజకీయ పార్టీ ప్రతినిధులతో ఈనెల 30 శనివారం మండల పరిషత్ కార్యాలయంలో సమావేశం ఏర్పాటు చేయనున్నట్లు ఎంపీడీవో జి.విమల తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామపంచాయతీ ముసాయిదా ఓటరు జాబితాను సరి చూసుకొని, రాజకీయ పార్టీ ప్రతినిధులు సకాలంలో హాజరై జాబితాలో వార్డుల వారీగా ఏమైనా అభ్యంతరాలు ఉంటే తెలపాలని కోరారు.

# మృతురాలి కుటుంబానికి పరామర్శ



**వరంగల్ వాయిస్, వీణవంక :** కరీంనగర్ జిల్లా సగర సంఘం నాయకులు శుక్రవారం వీణవంక మండల కేంద్రానికి చెందిన కంజుల స్వరూప కుటుంబాన్ని పరామర్శించారు. ఇటీవల మృతి చెందిన స్వరూప గురించి తెలుసుకున్న జిల్లా నాయకులు ఆమె కుటుంబాన్ని పరామర్శించి, తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ సందర్భంగా మృతురాలి చిత్రపటం వద్ద నివాళులర్పించిన సగర సంఘం నాయకులు, ఆమె మృతికి గల కారణాలను కుటుంబసభ్యులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సగర సంఘం తరఫున 50 కేజీల బియ్యం, నూనె ప్యాకెట్లను కుటుంబానికి అందజేశారు. ఈ పరామర్శ కార్యక్రమంలో కరీంనగర్ జిల్లా సగర సంఘం అధ్యక్షుడు దేవునూరి శ్రీనివాసు సగర, జిల్లా ప్రధాన కార్యదర్శి కట్టరాజు సగర, జిల్లా కోశాధికారి కాటిపెల్లి కుమారస్వామి సగర, బొడిపెల్లి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ ఆస్తులను ధ్వంసం చేసిన వారిపై కేసులు పెట్టాలి

■ మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి



**వరంగల్ వాయిస్, గణపురం:** మండల కేంద్రంలో గతంలో నిర్మించిన వారాంతపు సంత షెడ్లు, మరుగుదొడ్లను కూల్చివేయడంపై భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. శుక్రవారం ఆయన కూల్చివేతలు జరిగిన ప్రాంతాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా వెంకటరమణారెడ్డి మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో ప్రజల సౌకర్యార్థం నిర్మించిన కూరగాయల షెడ్లు, మూత్రశాలలను ఎటువంటి ముందస్తు నోటీసులు లేకుండా కూల్చివేయడం సరైన పద్ధతి కాదని అన్నారు. ఇది ప్రజల ఆస్తిని ధ్వంసం చేయడమేనని మండిపడ్డారు. ప్రజల ఆస్తులను ధ్వంసం చేసిన వారిపై తక్షణమే కేసులు నమోదు చేయాలని ఈ సందర్భంగా పోలీసు అధికారులను డిమాండ్ చేశారు. కూల్చివేతలు చేపట్టే సమయంలో స్థానిక బీఆర్ఎస్ నాయకులు అడ్డుకున్నప్పటికీ, పనులు కొనసాగించారని ఆయన అన్నారు. ఈ ఘటనపై పోలీసుల వైఖరిని ఆయన ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు మోతే కరుణాకర్ రెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ పోల్సాని లక్ష్మీ నరసింహారావు, పీఏసీఎస్ మాజీ చైర్మన్ పోరెడ్డి పూర్ణచంద్రారెడ్డి, మాజీ సర్పంచ్ పెంచాల రవీందర్, ఐలోని రామచంద్ర రెడ్డి, నాయకులు రవీందర్ రెడ్డి, గంజి జనయ, కసిరెడ్డి వెంకటరమణారెడ్డి, మామిండ్ల సాంబయ్య, రాజిరెడ్డి, మల్లారెడ్డి, జిల్లా యూత్ నాయకుడు గాజర్ల చింటుగౌడ్, వాజీద్, కొమురయ్య, శ్రీనివాస్, యాకయ్య, రఘు తదితరులు పాల్గొన్నారు.

# భక్తి శ్రద్ధలతో కుంకుమ పూజలు



**వరంగల్ వాయిస్, ఆత్మకూరు :** గణపతి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మూడవ రోజైన శుక్రవారం గణేష్ మండపాల వద్ద ఘనంగా భక్తులు గౌరీ, లక్ష్మీదేవి కుంకుమ పూజలు నిర్వహించారు. ఆత్మకూరు మండల కేంద్రంలోని పాత బస్టాండ్ వద్ద హిందూ ధర్మ పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో ఏర్పాటైన గణనాధుని వద్ద మహిళలు పెద్ద ఎత్తున మంగళ హారతులు నైవేద్యాలతో తరలివచ్చి గణపతి, గౌరీ కుంకుమ పూజలను నిర్వహించారు. అర్చకులు పవన్ కుమార్ వేదమంత్రాలతో భక్తుల చేత పూజలు జరిపించారు. అలాగే మండలంలోని కామారం గ్రామంలో యువ సైన్యం యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గౌరీ కుంకుమ పూజలను ఘనంగా నిర్వహించారు. కందుకూరి నరేష్ ఆచారి విశ్వకర్మచే భక్తులకు ప్రత్యేకంగా పూజలు జరిపించారు. దీంతో గ్రామాల్లో గణేష్ మండపాల వద్ద భక్తుల కోలాహలం కనిపించింది. కార్యక్రమంలో తోట కుమారస్వామి, కంది కిషన్ రెడ్డి, బూర వరుణ్ రాజ్, నర్మేటి రవితేజ, రాజేష్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

# గంగదేవిపల్లిలో జాతీయ క్రీడ దినోత్సవం



**వరంగల్ వాయిస్, వరంగల్:** ఉమ్మడి వరంగల్ జిల్లాలోని గంగదేవిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జాతీయ క్రీడా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని హాకీ దిగ్గజం, 'హాకీ మాంత్రికుడు' మేజర్ ధ్యాన్ చంద్ జయంతి సందర్భంగా ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మహమ్మద్ రజాక్ మాట్లాడుతూ ఒలింపిక్స్‌లో భారతదేశానికి మూడుసార్లు బంగారు పతకం సాధించిపెట్టిన మేజర్ ధ్యాన్ చంద్ స్ఫూర్తిని గుర్తు చేసుకుంటూ ప్రతి సంవత్సరం జాతీయ క్రీడా దినోత్సవం జరుపుకుంటున్నామని తెలిపారు. విద్యార్థుల శారీరక, మానసిక ఎదుగుదలకు క్రీడలు ఎంతగానో ఉపయోగపడతాయని, అవి వారిలో చురుకుదనాన్ని పెంచుతాయని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయుడు తాళ్లపల్లి రాజన్నను ఘనంగా సన్మానించారు. వివిధ క్రీడా పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో ఉపాధ్యాయులు స్వరూపారాణి, వెంకటేశ్వర్లు, అనిత, మాధురి, కుమారస్వామి, రాజన్న, విద్యార్థులు పాల్గొన్నారు.

# వినియోగదారుల హక్కులు ఆయుధం లాంటివి



**వరంగల్ వాయిస్, హనుమకొండ:** వినియోగదారులకు హక్కుల చట్టంపై అవగాహన కల్పించడం ద్వారానే వారికి న్యాయం చేకూర్చవచ్చని వరల్డ్ వైజ్ కన్స్యూమర్ రైట్స్ అండ్ ప్రొటెక్షన్ నేషనల్ ఫౌండర్ చైర్మన్ డాక్టర్ రామానుజ స్వామి అన్నారు. హనుమకొండ నక్కలగుట్టలోని జై భారత్ కళాశాలలో విద్యార్థులు, సిబ్బంది కోసం ఏర్పాటు చేసిన వినియోగదారుల హక్కుల చట్టం-2019, రక్షణ బాధ్యతలపై అవగాహన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ రామానుజ స్వామి మాట్లాడుతూ.. "చట్టాలపై అవగాహన ఉన్నప్పుడే వాటిని వినియోగించుకోగలుగుతారు. నాణ్యమైన వస్తు సేవలను పొందడం ప్రతి పౌరుడి హక్కు. ఈ హక్కుల గురించి ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలి," అని అన్నారు. వరల్డ్ వైజ్ కన్స్యూమర్ రైట్స్ అండ్ ప్రొటెక్షన్ నేషనల్ వైస్ చైర్మన్, అడ్వైజర్ అనితా రెడ్డి మాట్లాడుతూ ఒక వ్యక్తికి అవగాహన కల్పించడం అంటే ఒక కుటుంబాన్ని, తద్వారా సమాజాన్ని మోసాల బారి నుండి కాపాడడమేనన్నారు. విద్యార్థులు వినియోగదారుల మెలకువలు నేర్చుకోవాలని, ప్రజలను చైతన్యం చేసి మోసపోకుండా చేయడమే తమ లక్ష్యమని తెలిపారు. వరంగల్ జిల్లా చైర్మన్ బోనగిరి రాజన్న, లక్ష్మీ నారాయణ, కళాశాల ప్రిన్సిపాల్ కరుణాకర్, విద్యార్థులు పాల్గొన్నారు.

# ప్రజాసేవలో వెంకటాపూర్ పోలీసులు

◆ వర్షాలకు దెబ్బతిన్న రోడ్లకు మరమ్మతులు
◆ ఎస్సై చల్లా రాజుకు ప్రజల అభినందనలు



**వరంగల్ వాయిస్, వెంకటాపూర్ :** శాంతిభద్రతల పరిరక్షణతో నిత్యం బిజీగా ఉండే వెంకటాపూర్ పోలీసులు, ప్రజాసేవలోనూ తాము ముందుంటామని నిరూపించారు. ఇటీవల కురుస్తున్న భారీ వర్షాల కారణంగా మండలంలోని పలు గ్రామాల్లో దెబ్బతిన్న రోడ్లకు మరమ్మతులు చేపట్టారు. గణేశ్ నవరాత్రి ఉత్సవాల నేపథ్యంలో వాహనదారులకు, ప్రజలకు ఇబ్బందులు లేకుండా ఉండేందుకు వెంకటాపూర్ ఎస్సై చల్లా రాజు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ముఖ్యంగా, మండలంలోని లక్ష్మీదేవిపేట-బూర్గుపేట గ్రామాల మధ్య ప్రధాన రహదారి పూర్తిగా పాడైపోవడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ సమస్యను గుర్తించిన ఎస్సై చల్లా రాజు, నారాయణపూర్ గ్రామంలోని ట్రాక్టర్ యూనియన్ అసోసియేషన్ సహకారంతో మొరం పోయించి రోడ్డుకు మరమ్మతులు చేయించారు. గత వారం రోజులుగా రాకపోకలకు ఇబ్బంది పడిన వాహనదారులు, స్థానిక ప్రజలు పోలీసుల ఈ సేవపై హర్షం వ్యక్తం చేస్తూ ఎస్సై చల్లా రాజుతో పాటు సిబ్బందిని అభినందించారు.



# జాన్వీ మూవీ

## సన్నీ సంస్కార్ కీ తులసి కుమారి

జాన్వీ కపూర్, వరుణ్ ధావన్ జంటగా నటిస్తున్న చిత్రం 'సన్నీ సంస్కారి కీ తులసి కుమారి'. జాన్వీ లేటెస్ట్ చిత్రమిది. ఓ యువ జోడీ ప్రేమ ప్రయాణం నేపథ్యంలో శశాంక్ ఖైతాన్ తెరకెక్కిస్తున్నారు. దసర కానుకగా అక్టోబర్ 2న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ నేపథ్యంలో తాజాగా దీని టీజర్‌ను చిత్రబృందం విడుదల చేసింది. కామెడీ ఎంటర్‌టైనర్‌గా రానున్నట్లు– టీజర్ ఆధారంగా అర్థమవుతోంది.





# నాగ్ బర్త్‌డే స్పెషల్ మ్యాష్ అప్ విడుదల

టాలీవుడ్‌లో ఎంతోమంది హీరోలున్నప్పటికీ గ్రీకువీరుడు, మన్మథుడు, కింగ్ అనగానే గుర్తొచ్చేది మాత్రం నాగార్జుననే. నటనలో శివ నుంచి మొదలు ఇక తనకు తిరుగులేదని నిరూపించుకున్నాడు.66 ఏళ్ల వయసులోనూ భిన్నమైన పాత్రలు ఎంచుకుంటూ వరుస సినిమాలతో అలరిస్తున్నాడీ హీరో. శుక్రవారం అక్కినేని హీరో పుట్టినరోజు సందర్భంగా అన్నపూర్ణ స్టూడియోస్ ఓ స్పెషల్ మ్యాష్‌అప్ వీడియోను విడుదల చేసింది. ఇప్పటి వరకూ ఆయన చేసిన సినిమాల్లోని కొన్ని పాత్రల ఫేమస్ డైలాగులతో చేసిన ఈ వీడియో ప్రస్తుతం వైరల్‌గా మారింది. 'ఈ ఫీల్డ్‌లో కొత్తగా ట్రై చేయాలంటే నేనే' అంటూ నాగార్జున డైలాగ్ ఆకట్టుకుంటోంది. నాగ్ బర్త్ డే సందర్భంగా అయనకు సినీ రాజకీయ ప్రముఖులు,అభిమానులు విషెస్ తెలిపారు.

## అఖండ-2 విడుదల

# మరింత ఆలస్యం

విజయవంతమైన 'అఖండ' చిత్రానికి కొనసాగింపుగా రూపొందుతున్న 'అఖండ 2: తాండవం' విడుదల వాయిదా పడిరది. నిర్మాణానంతర పనుల కోసం అదనపు సమయం కేటాయించాల్సి రావడంతోనే ఈ నిర్ణయం తీసుకున్నట్టుగా నిర్మాణ సంస్థలు ఓ ప్రకటనలో తెలిపాయి. బాలకృష్ణ కథానాయకుడిగా బోయపాటి శ్రీను దర్శకత్వంలో రూపొందుతున్న చిత్రమిది. సంయుక్తా మేనన్ కథానాయిక. ఎం.తేజస్విని నందమూరి సమర్పణలో 14 రీల్స్ ప్లస్ పతాకంపై రామ్ ఆచంట, గోపి ఆచంట నిర్మిస్తున్నారు. సెప్టెంబరు 25న సినిమాని విడుదల చేయాలని ఇదివరకు నిర్ణయించిన సంగతి తెలిసిందే. అయితే, సినిమా స్థాయిని దృష్టిలో ఉంచుకుని మరింత నాణ్యమైన రీరికార్డింగ్, విజువల్ ఎఫెక్ట్స్ హంగుల్ని జోడిరచడం కోసం సినిమా విడుదలని వాయిదా వేస్తున్నట్టు– నిర్మాణ వర్గాలు తెలిపాయి. కొత్త విడుదల తేదీని త్వరలోనే ప్రకటిస్తామని పేర్కొన్నాయి. ప్రేక్షకులకు గొప్ప థియేట్రికల్ అనుభూతిని పంచడం కోసం విజువల్స్ పరంగా, స్కేల్ పరంగా రాజీపడకుండా మా బృందం పనిచేస్తోంది. 'అఖండ'కి కొనసాగింపుగా వస్తున్న ఈ సినిమాపై భారీ అంచనాలున్నాయి. అందుకు దీటు–గా చిత్రాన్ని మలచడంపై దృష్టి పెట్టామని నిర్మాణ వర్గాలు తెలిపాయి. యువ కథానాయకుడు ఆది పినిశెట్టి ఇందులో కీలక పాత్రని పోషిస్తున్నారు. సంగీతం తమన్ అందిస్తున్నారు.






## డ్యూడ్ మూవీ నుంచి

# సాంగ్ విడుదల

'లవ్‌టు–డే'తో తెలుగు ప్రేక్షకులనూ ఆకట్టుకున్న తమిళ నటుడు ప్రదీప్ రంగనాథన్ హీరోగా నటిస్తున్న కొత్త చిత్రం 'డ్యూడ్'. టాలీవుడ్ నిర్మాణ సంస్థ మైత్రీ మూవీ మేకర్స్ నిర్మిస్తుండడం విశేషం. మమితా బైజు హీరోయిన్. కీర్తిస్వరన్ దర్శకత్వం వహిస్తున్నారు. దీపావళికి సినిమాని విడుదల చేయనున్నారు. ప్రచారంలో భాగంగా తొలి పాటను రిలీజ్ చేశారు. సానపాటి భరద్వాజ్ పాత్రుడు సాహిత్యం అందించారు. స్వీయ సంగీత దర్శకత్వంలో సాయి అభ్యంకర్ పాడారు.

# నకిలీ పాస్ పుస్తకాలతో బ్యాంకులకు టోకరా

- కురవిలో ముగ్గురు అరెస్టు
- మహబూబాబాద్ డీఎస్పీ తిరుపతిరావు వెల్లడి



**వరంగల్ వాయిస్, డోర్నకల్ :** నకిలీ పాస్ పుస్తకాలు, ఇతర పత్రాలతో బ్యాంకులకు కుచ్చుటోపీ పెడుతున్న ముఠాను కురవి పోలీసులు చాకచక్యంగా పట్టుకున్నారు. ఈ ముఠాలోని ముగ్గురు సభ్యులను అరెస్టు చేశారు. వారి నుంచి 23 నకిలీ పాస్ పుస్తకాలు, ల్యాప్‌టాప్, కంప్యూటర్, రెండు ప్రింటర్లు, మూడు సెల్‌ఫోన్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. శుక్రవారం కురవి పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మహబూబాబాద్ డీఎస్పీ తిరుపతిరావు వివరాలు వెల్లడించారు. అరెస్టు అయిన వారిలో కురవి మండలం మచ్చ్యాతండాకు చెందిన మూడ్ బాలాజీ, మహబూబాబాద్ జిల్లా అమనగల్ కన్నతండాకు చెందిన బానోత్ హరికిషన్, జాఫర్ ఘడ్ మండలం ఓట్లాపురం గ్రామానికి చెందిన బానోత్ వర్జన్ ఉన్నారని తెలిపారు. వీరు అమాయకులైన రైతులను లక్ష్యంగా చేసుకుని, ఎక్కువ రుణాలు ఇప్పిస్తామని నమ్మబలికి, ఒక్కో పాస్ పుస్తకానికి రూ. 10 వేలు వసూలు చేసి నకిలీ పాస్ పుస్తకాలు సృష్టించేవారని పేర్కొన్నారు. వీరు కురవిలోని యూనియన్ బ్యాంకులో ఒకరికి, డోర్నకల్‌లోని యూనియన్ బ్యాంకులో ఆరుగురికి, మహబూబాబాద్‌లోని యూనియన్ బ్యాంకులో ఒకరికి, కెనరా బ్యాంకులో ముగ్గురికి ఇలా మొత్తం రూ. 16,90,000 రుణాలు ఇప్పించినట్లు డీఎస్పీ తెలిపారు. మరింత మందికి రుణాలు ఇప్పించేందుకు కురవి వచ్చినప్పుడు పోలీసులు వీరిని అదుపులోకి తీసుకున్నారు. సకాలంలో అరెస్టు చేయకపోతే సుమారు కోటి రూపాయల వరకు బ్యాంకులకు నష్టం వాటిల్లేదని డీఎస్పీ చెప్పారు. ఈ ముఠాలో మరికొందరు ఉన్నారని, వారి కోసం గాలిస్తున్నామని డీఎస్పీ తెలిపారు. ఈ అక్రమ వ్యవహారంలో బ్యాంకు ఉద్యోగుల ప్రమేయం కూడా ఉండి ఉండవచ్చని అనుమానాలు వ్యక్తమవుతున్న నేపథ్యంలో, దీనిపై సమగ్ర విచారణ జరుపుతున్నట్లు ఆయన స్పష్టం చేశారు. నకిలీ పత్రాలతో రుణాలు తీసుకున్న వారిని కూడా అరెస్ట్ చేస్తామన్నారు. ఈ సమావేశంలో రూరల్ సీఐ సర్వయ్య, కురవి ఎస్సై సతీష్ పాల్గొన్నారు.

# అభ్యంతరాలుంటే చెప్పండి

- ఈనెల 30 వరకు అవకాశం
- హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్
- జీపీల్లో ఓటర్ల ముసాయిదా జాబితా రెడీ

**వరంగల్ వాయిస్, హనుమకొండ :** జిల్లాలోని అన్ని గ్రామ పంచాయతీల్లో ఓటర్ల ముసాయిదా జాబితాను ప్రదర్శించామని, అందులో ఏవైనా అభ్యంతరాలు ఉన్నట్లయితే ఈ నెల 30 లోగా తెలియజేయాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ సూచించారు. శుక్రవారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో జిల్లాలోని అన్ని గ్రామ పంచాయతీల్లో ప్రదర్శించిన ఓటర్ల ముసాయిదా జాబితాపై వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. గ్రామపంచాయతీలో ప్రదర్శించిన ఓటర్ల ముసాయిదా జాబితా, పోలింగ్ కేంద్రాల వివరాలను జిల్లా కలెక్టర్ రాజకీయ పార్టీల ప్రతినిధులకు వివరించారు. ఈ సందర్భంగా రాజకీయ పార్టీల ప్రతినిధులు ఓటర్ల జాబితా, పోలింగ్ కేంద్రాల గురించి అడిగిన పలు ప్రశ్నలకు సమాధానమిచ్చారు. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్ మాట్లాడుతూ జిల్లాలో 210 గ్రామపంచాయతీలు ఉన్నాయని, వాటిల్లో ఓటర్ల ముసాయిదా జాబితాను గురువారం ప్రదర్శించామని పేర్కొన్నారు. ఓటర్ల జాబితాపై ఏవైనా అభ్యంతరాలు ఉన్నట్లయితే వాటి వివరాలతో కూడిన సమాచారాన్ని అందజేయాలన్నారు. ఓటర్ల జాబితాపై గ్రామస్థాయికి తీసుకెళ్లాలని సమావేశంలో పాల్గొన్న రాజకీయ పార్టీల ప్రతినిధులకు సూచించారు. మండల స్థాయిలో ఈ నెల 30వ తేదీన సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఏ చిన్న సమస్య ఉన్నా తమ దృష్టికి తీసుకురావాలని కలెక్టర్ సూచించారు. ఓటర్ల ముసాయిదా జాబితాపై అభ్యంతరాల స్వీకరణ పూర్తి చేసి తుది ఓటర్ల జాబితాను వచ్చే నెల 2న ప్రచురణ చేయడం జరుగుతుందన్నారు. జిల్లాలో గ్రామపంచాయతీ ఓటర్లు 3,70,867, పోలింగ్ కేంద్రాలు 1986 ఉన్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా గ్రామపంచాయతీలతోపాటు మున్సిపల్ పరిధిలో ఓటు ఉన్నవారిని గుర్తించి ఒకే చోట ఓటు ఉండేలా చర్యలు తీసుకోవాలని కోరుతూ ఆ జాబితాను బీఆర్ఎస్ పార్టీ ప్రతినిధి, కార్పొరేటర్ డాక్టర్ ఇండ్ల నాగేశ్వర్ రావు, తదితరులు కలెక్టర్ కు అందజేశారు. ఈ సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ వెంకట్ రెడ్డి, జిల్లా పంచాయతీ అధికారి లక్ష్మీ రమాకాంత్, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు ఇవీ శ్రీనివాస్ రావు, నిశాంత్, ప్రభాకర్ రెడ్డి, రజినీకాంత్, ఎండి నేహాల్, శ్యాంసుందర్, సయ్యద్ ఫైజుల్లా, కొట్టె ఏసోబు, మణి పాల్గొన్నారు.

# సాంబయ్య మృతి కాంగ్రెస్‌కు తీరని లోటు

**మంత్రి కొండా సురేఖ-మురళీ**



**వరంగల్ వాయిస్, పరకాల :** పట్టణానికి చెందిన సీనియర్ కాంగ్రెస్ నాయకులు, మాదారం పీఏసీఎస్ మాజీ చైర్మన్, డీసీసీబీ మాజీ డైరెక్టర్ పూజారి సాంబయ్య మరణం పట్ల రాష్ట్ర మంత్రి కొండా సురేఖ, మాజీ ఎమ్మెల్సీ మురళీధర్ రావు ప్రగాఢ సంతాపం తెలిపారు. శుక్రవారం పూజారి సాంబయ్య స్వగృహానికి వెళ్లి ఆయన పార్థివదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సాంబయ్య కుటుంబసభ్యులను ఓదార్చి, వారికి ధైర్యం చెప్పారు. ఈ కష్ట సమయంలో కొండా దంపతుల సహకారం ఎల్లవేళలా ఉంటుందని భరోసా ఇచ్చారు. అనంతరం పూజారి సాంబయ్య అంతిమయాత్రలో కొండా దంపతులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ పూజారి సాంబయ్య మరణం తమకు, కాంగ్రెస్ పార్టీకి తీరని లోటని ఆవేదన వ్యక్తం చేశారు. సాంబయ్య తెలంగాణ ఉద్యమంలో చురుగ్గా పాల్గొన్నారని, పార్టీకి ఎనలేని సేవలు అందించారని గుర్తు చేసుకున్నారు. తాను 1999లో తొలిసారి ఎమ్మెల్యేగా గెలిచినప్పటి నుంచి ఆయన తనను సోదరిలా భావించి ప్రోత్సహించేవారని సురేఖ చెప్పారు. పార్టీ పట్ల, తమ పట్ల సాంబయ్యకు అమితమైన అభిమానం ఉందని కొనియాడారు. ఆయన లేకపోవడం వ్యక్తిగతంగా తమకు తీరని లోటని మంత్రి అన్నారు.

# అతని ఆస్తులు రూ. 5 కోట్ల పైనే

- ఫోర్ట్ వరంగల్ తహశీల్దార్ పై ఏసీబీ కేసు
- హనుమకొండలోని ఇంటితోపాటు ఏడు ప్రాంతాల్లో సోదాలు

**వరంగల్ వాయిస్, వరంగల్ :** ఆదాయానికి మించి ఆస్తులు కూడబెట్టిన కేసులో ఖిలా వరంగల్ మండలం తహశీల్దార్ బండి నాగేశ్వరరావుపై అవినీతి నిరోధక శాఖ అధికారులు కేసు నమోదు చేశారు. తహశీల్దార్, అతని కుటుంబ సభ్యుల ఇండ్లు, కార్యాలయంతో సహా ఏడు ప్రాంతాల్లో శుక్రవారం ఏసీబీ అధికారులు ఏకకాలంలో సోదాలు నిర్వహించారు. హనుమకొండ ప్రశాంత్ నగర్ లోని ఆయన ఇంటిపై వరంగల్ ఏసీబీ అధికారులు ఉదయం నుంచి సోదాలు చేపట్టారు. తహసిల్దార్ నాగేశ్వరరావు సొంత జిల్లా ఖమ్మంలో సైతం ఏసీబీ సోదాలు నిర్వహించారు. బండి నాగేశ్వర్ రావు గతంలో ధర్మసాగర్, కాజీపేట, హసన్ పర్తి మండలాల్లో తహసిల్దారుగా పనిచేశారు. ఆ సమయంలో ఆయనపై ఆరోపణలు వచ్చినట్లు తెలిసింది. ఈ నేపథ్యంలో ఆదాయానికి మించి ఆస్తులు కలిగి ఉన్నారనే ఆరోపణలపై ఏసీబీ అధికారులు సోదాలు చేపట్టినట్లు తెలిసింది. ఉదయం ప్రారంభమైన సోదాలు సాయంత్రం వరకు సాగాయి. ఏసీబీ అధికారుల ప్రాథమిక దర్యాప్తులో బండి నాగేశ్వరరావుకు చెందిన రూ. 5.02 కోట్లకు పైగా అక్రమాస్తులను గుర్తించారు. ఇంటి ఆస్తుల విలువ రూ. 1.15 కోట్లు, 17.10 ఎకరాల వ్యవసాయ భూమి విలువ రూ. 1.42 కోట్లు, 70 తులాల బంగారు ఆభరణాల విలువ రూ. 23.84 లక్షలు, 1,791 గ్రాముల వెండి వస్తువుల విలువ రూ. 92 వేలు, రెండు నాలుగు చక్రాల వాహనాలు, ఒక ద్విచక్ర వాహనం విలువ రూ. 34.78 లక్షలు, 23 చేతి గడియారాల విలువ రూ. 3.28 లక్షలు, గృహోపకరణాల విలువ రూ. 16.43 లక్షలుగా గుర్తించారు. అదనపు ఆస్తుల విలువను నిర్ధారించే ప్రక్రియ కొనసాగుతోందని, ప్రస్తుత మార్కెట్ విలువలు ప్రభుత్వ విలువ కంటే చాలా ఎక్కువగా ఉండే అవకాశం ఉందని ఏసీబీ అధికారులు తెలిపారు. దర్యాప్తు పూర్తయిన తర్వాత మరిన్ని వివరాలు వెల్లడిస్తామన్నారు. కేసు దర్యాప్తు కొనసాగుతుండగా, నిందితుడు బండి నాగేశ్వరరావును ఏసీబీ అధికారులు అరెస్టు చేసి, వరంగల్‌లోని ప్రత్యేక న్యాయమూర్తి ఎదుట హాజరుపరిచారు.



# ఘనంగా కుంకుమ పూజ

**వరంగల్ వాయిస్, హనుమకొండ :** గ్రేటర్ వరంగల్ 55వ డివిజన్ పరిధిలోని కాకతీయ నగర్ కాలనీలో కాలనీ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు సోయం ఓదేలు ఆధ్వర్యంలో శుక్రవారం వినాయక మండపంలో మహిళలు అత్యంత భక్తి శ్రద్ధలతో కుంకుమ పూజలు నిర్వహించారు. విఘ్నేశ్వరుడికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, అర్చనలు నిర్వహించి, నైవేద్యం సమర్పించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు ధనసరి సారంగపాణి, మంద గట్టయ్య, కమటం రమేష్, చింత రవీందర్, పోశాల తిరుపతి, మనోహర్ నాయక్, శివప్రసాద్ మోహన్, సాయి కుమార్, మన్నెం శ్రీనివాస్, చింతల సురేష్, రాజేందర్ తోపాటు దనసరి లక్ష్మి, కమటం అరుంధతి, జినుకల సుమ, చింతల స్వప్న, జ్యోతి, విజయ, చందన తదితరులు పాల్గొన్నారు.

# సమాజహితానికి జర్నలిస్టులు పనిచేయాలి

- సమాచార కమిషనర్లు పీవీ శ్రీనివాస్, బోరెడ్డి అయోధ్యరెడ్డి

**వరంగల్ వాయిస్, హనుమకొండ :** జర్నలిస్టులు సమాజహితం కోసం పనిచేయాలని రాష్ట్ర సమాచార హక్కు చట్టం కమిషనర్లు పీవీ శ్రీనివాస్, బోరెడ్డి అయోధ్యరెడ్డి అన్నారు. శుక్రవారం అధికారిక పర్యటన నిమిత్తం వరంగల్ కు విచ్చేసిన వీరికి గ్రేటర్ వరంగల్ ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు వేముల నాగరాజు అధ్యక్షతన ఆత్మీయ సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ప్రెస్ క్లబ్ కు విచ్చేసిన సీనియర్ జర్నలిస్టులైన సమాచార హక్కు చట్టం కమిషనర్లు క్లబ్ సభ్యులతో ముచ్చటించారు. ఈ కార్యక్రమంలో క్లబ్ ప్రధాన కార్యదర్శి బొల్లారం సదయ్య, గొకారపు శ్యాం, యంసాని శ్రీనివాస్, పొడిచెట్టి విష్ణువర్ధన్, ఎండీ నయీంపాషా, బలవారి విజయ్ రాజ్, యూనియన్ల నేతలు గడ్డం రాజిరెడ్డి, తోట సుధాకర్, వల్లాల వెంకటరమణ, గడ్డం కేశవమూర్తి, పెండెం వేణుమాధవ్, ఎం అరుణ్, బూరం ప్రశాంత్, నల్లాల బుచ్చిరెడ్డి, విద్యాసాగర్ పలువురు సీనియర్ జర్నలిస్టులు పాల్గొన్నారు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY GADDAM KESHAVA MURTHY, PRINTED AT MANIKANTA GRAPHICS, H.NO.4-10-121, KUMARPALLY, HANAMKONDA, WARANGAL URBAN DISTRICT-506001, TELANGANA STATE, PUBLISHED AT H.NO. 4- 7-138/1, KUMARPALLY, HANAMKONDA, WARANGAL.-506001. WARANGAL URBAN DISTRICT, TELANGANA STATE.
EDITOR : GADDAM KESHAVA MURTHY. RNI NO: TELTEL/2021/80377, PHONE NO : 8008794162, MAIL ID : gaddamkeshavamurthy@gmail.com